క్లుప్తంగా

ఆస్తిపన్ను వసూలుకు వినూత్న ప్రచారం



గులాబీలతో కమిషనర్ నరేశ్, సిబ్బంది

జగిత్యాలటౌన్: బకాయి పడ్డ ఆస్తి పన్ను వసూలుకు జగిత్యాల మున్సిపల్ కమిషనర్ బోనగిరి నరేశ్ వినూత్న ప్రచారం చేపట్టారు. ఆస్తిపన్ను బకాయి ఉన్న ఇళ్ల యజమానులకు గులాబీ ఇస్తూ పన్ను చెల్లించి బల్దియా అభివృద్ధికి సహకరించాల్సిందిగా కోరారు. ఈమేరకు ఆదివారం తన సిబ్బందితో కలిసి ఇంటింటా తిరుగుతూ గులాబి ఇచ్చి పన్ను వసూలు చేశారు. బల్దియా మేనేజర్ దేవేందర్, బిల్ కలెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

క్రీడలు స్నేహసంబంధాన్ని పెంపొందిస్తాయి



మాట్లాడుతున్న మదన్‌మోహన్

రాయికల్: క్రీడలు స్నేహ సంబంధాన్ని పెంపొందిస్తాయని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిలకమర్రి మదన్‌మోహన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని మైతాపూర్ గ్రామంలో ఎంపీటీసీ రాజనాల మధుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా యువకుల్లో స్నేహసంబంధాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, మోత్కూరి శ్రీనివాస్, పాలడుగు రమణ, జీవన్, విష్ణు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏసీడీ చార్జీలు రద్దు చేయాలి



మాట్లాడుతున్న శంకర్

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం విద్యుత్ ఏసీడీ చార్జీలను రద్దు చేయాలని తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పుడు విద్యుత్‌బిల్లుల భారం వేయడం తగదన్నారు. ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకుంటే ఉద్యమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దిలీప్‌కుమార్, ఏశాల గంగారెడ్డి, తరుణ్, తిరుపతి, రవి పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ

మల్యాల: మండలంలోని 5వ వార్డులో సీసీరోడ్డు నిర్మాణానికి స్థానిక సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్ ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వీధుల్లో ఎమ్మెల్యే రవిశంకర్ సహకారంతో సీసీరోడ్లు వేస్తున్నామని, డ్రైనేజీలు నిర్మిస్తూ మల్యాలను అభివృద్ధిలో ముందు వరుసలో నిలుపుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు నీలం నారాయణ, జవ్వాజి శ్రీనివాస్, కురుమ సంఘం సభ్యులు రమేశ్, లింగయ్య, రాయమల్లు, గుంట మహేశ్, తిరుపతి, హనుమాన్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



క్రికెట్ బ్యాట్స్ అందజేస్తున్న గోపాల్‌రెడ్డి

కథలాపూర్: యువకులు క్రీడల్లో రాణించాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని పెగ్గెర్ల, ఊట్‌పెల్లి గ్రామాల్లోని యువకులకు క్రికెట్ బ్యాట్స్ అందజేశారు. యువకులు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో గ్రామానికో రెండు బ్యాట్లు అందించినట్లు ఆయన తెలిపారు. బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు ఆరెల్లి సాయి, శివ, నరేశ్, నర్సయ్య, ప్రణీత్, మహేశ్, రణధీర్, ప్రకాశ్, ఆనంద్ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

రాయికల్: మండలంలోని మూటపెల్లి గ్రామంలో ఆదివారం వాలీబాల్ పోటీలను గ్రామ సర్పంచ్ బెక్కం తిరుపతి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతంలోని యువకులను ప్రోత్సహించేందుకే పోటీలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

‘భగీరథ’ వచ్చినా తప్పని విద్యుత్‌భారం

- ప్రతినెలా మండలంలో పంచాయతీలకు నీటి సరఫరా బిల్లు రూ.7లక్షలు
- రెండేళ్ల క్రితం విద్యుత్ కనెక్షన్లను తొలగించిన ట్రాన్స్‌కో అధికారులు
- మండలంలో 13వేల నల్లా కనెక్షన్లు



రాజారాం తండా గ్రామంలో రక్షిత మంచినీటి ట్యాంక్

కథలాపూర్: మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ మంచినీరు అందిస్తున్నామని పాలకులు ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. మిషన్ భగీరథ పథకం అమలు కాకముందు గ్రామాల పరిధిలో ప్రజలకు నీటి సరఫరా చేసే బావులు, బోరుబావుల విద్యుత్ మోటార్ల బిల్లులు పంచాయతీలు చెల్లించేవి. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా నీళ్లు వస్తున్నాయని, ఆయా వాడల్లో ఉన్న బోరుబావుల బిల్లులను పంచాయతీలు చెల్లించొద్దని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో రెండేళ్లక్రితం విద్యుత్ కనెక్షన్లు, మీటర్లు తొలగించారు. అయినప్పటికీ కథలాపూర్ మండలంలో ప్రతినెలా నీటి సరఫరా కోసం పంచాయతీలపై విద్యుత్ బిల్లుల భారం పడుతుండటం గమనార్హం.

మండలంలో 13వేల నల్లా కనెక్షన్లు..

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలున్నాయి. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు మంచినీరు అందించాలనే ఉద్దేశంతో అన్ని గ్రామాల్లో రక్షిత మంచినీటి ట్యాంకులను మరమ్మతు చేయించారు. అవసరమైన చోట కొత్త వాటర్ ట్యాంకులు నిర్మించారు. వాడవాడలా ప్రత్యేకంగా పైపులైన్ వేసి ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చారు. ఇలా 13వేల నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇంటింటికీ మంచినీరు అందుతుందని భావించిన ఉన్నతాధికారులు.. ఇన్నాళ్లు ఆయా గ్రామాల్లోని వాడల్లో గ్రామ పంచాయతీల పేరుమీద ఉన్న నీటి సరఫరా బోరుబావుల విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని ఆదేశించారు. దీంతో రెండేళ్ల క్రితం వాడల్లో బోరుబావుల విద్యుత్ కనెక్షన్లను ట్రాన్స్‌కో అధికారులు తొలగించారు.

ప్రతినెలా విద్యుత్‌బిల్లు రూ.7లక్షలు..

మండలాన్ని ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా కోసం కథలాపూర్, అంబారిపేట క్లస్టర్లుగా విభజించారు. కథలాపూర్ క్లస్టర్ పరిధిలో 10 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో చెల్లించాల్సిన నీటిసరఫరా విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.33.58 లక్షలు. అంబారిపేట క్లస్టర్ పరిధిలో 9 గ్రామాలుండగా.. నీటిసరఫరా విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.9.72 లక్షలు. నీటి సరఫరా కోసం అన్ని గ్రామపంచాయతీలకు కలిపి విద్యుత్ బిల్లు నెలకు సుమారు రూ.7లక్షలు వస్తుందని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ మంచినీరు సరఫరా అవుతున్నప్పటికీ నీటిసరఫరా విద్యుత్ బిల్లులు పంచాయతీలు చెల్లిస్తుండడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు దృష్టిసారించి మిషన్ భగీరథ నీటి సరఫరా, పంచాయతీలు నీటిసరఫరా విద్యుత్ బిల్లులు చెల్లించే విషయంపై వాస్తవాలు తెలుసుకొని తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బిల్లుల భారం పడుతోంది



తక్కళ్లపెల్లికి భగీరథ పథకం నీళ్లు సరిగా రాకపోవడంతో మోటార్లతో ట్యాంకులు నింపుతున్నాం. దీంతో పంచాయతీపై విద్యుత్ బిల్లుల భారం పడుతోంది. ప్రతినెలా రూ.38వేలు విద్యుత్ బిల్లులు పంచాయతీ నుంచి చెల్లిస్తున్నాం. భగీరథ నీళ్లు సక్రమంగా సరఫరా చేయాలి. – మొలిగె లక్ష్మి, సర్పంచ్, తక్కళ్లపెల్లి

భగీరథను వినియోగించుకోవాలి

మిషన్ భగీరథ పథకం ద్వారా కథలాపూర్ మండలంలోని అన్ని గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నాం. పైపుల మరమ్మతులు ఉంటే వెంటనే చేయిస్తున్నాం. మిషన్ భగీరథ పథకం నీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– నవీన్‌కుమార్, మిషన్ భగీరథ గ్రిడ్ విభాగం డీఈ, వేములవాడ

అటెన్షన్ ప్లీజ్



అపరిశుభ్రంగా నీటితొట్టెలు

బుగ్గారం: మండలంలోని సిరికొండలో పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటితొట్టెలు అపరిశుభ్రంగా మారాయి. పశువులు వివిధ ప్రాంతాల్లోని అపరిశుభ్రమైన నీటిని తాగి రోగాలపాలు కాకుండా ఉండేందుకు ఈజీఎస్ నిధులతో ప్రతి గ్రామంలో నీటితొట్టెలు నిర్మించారు. కానీ మండలంలోని పలు గ్రామాల్లో ఇవి నిరుపయోగంగా మారాయి. కొన్నిచోట్ల పూర్తిగా చెడిపోయి పనికిరాకుండా పోగా మరికొన్ని గ్రామాల్లో సరైన నిర్వహణ లేక చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. సిరికొండ గ్రామంలో గల నీటితొట్టెలు బాగానే ఉన్నప్పటికీ చాలాకాలంగా వీటి నిర్వహణ గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో నాచు, చెత్తచెదారంతో నిండి పూర్తి అపరిశుభ్రంగా మారాయి. ఇకనైనా అధికారులు స్పందించి వీటిని శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారిపేరు : సురేశ్, పంచాయతీ కార్యదర్శి, సిరికొండ
ఫోన్ నంబర్ 95157 03195

సామాన్యుడికి అందుబాటులో మెరుగైన వైద్యం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: సీఎం సహాయనిధితో సామాన్యులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్‌తో సామాన్యులకు సైతం మెరుగైన వైద్యం అందుతోందని, బస్తీ దవాఖానాలతో స్థానికంగా వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో బల్దియా చైర్‌పర్సన్ బోగ శ్రావణి, వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, కొలగాని సత్యం తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ పెద్దపీట

రాయికల్: దళితుల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలోని అంబేద్కర్ మాల యువజన సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి మాల సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు, అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ దళితబంధు ప్రవేశపెట్టి ఎంతో మంది పేదలకు ఉపాధి అవకాశం కల్పించారని గుర్తు చేశారు. సంఘం అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వేల్పుల లక్ష్మణ్ పాల్గొన్నారు

క్యాలెండర్ ఆవిష్కరణ

యువ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లె పురుషోత్తం, రాయికల్ కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి, న్యాయవాది మహేశ్, సంపత్, భీమయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల: సీఎం సహాయనిధి నిరుపేదలకు ఆర్థిక భరోసానిస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం బూర్గుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్యాల మండలానికి చెందిన 18మంది లబ్ధిదారులకు రూ.3,45,000 విలువైన చెక్కులను ఎమ్మెల్యే రవిశంకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ సహాయనిధితో అండగా నిలుస్తున్నామని, వైద్య చికిత్సకు అవసరమైన వారికి ఎల్‌వోసీ అందజేస్తూ, నిరుపేదల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, సర్పంచ్ సుంకె లచ్చయ్య, నాయకులు మారంపల్లి నారాయణ, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదవారికి అండగా..

కొడిమ్యాల: ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సపొందిన పేదలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఈ మేరకు కొడిమ్యాల మండలంలోని 22 మంది లబ్ధిదారులకు ఆదివారం రూ.6,52,000 విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, పీఏసీఎస్ చైర్మన్ పోలు రాజేందర్, సర్పంచ్ ఎగుర్ల తిరుపతి, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పులి వెంకటేశ్, నాయకులు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, అక్బర్, బండి రాజు పాల్గొన్నారు.

రాబోయేది బహుజన రాజ్యమే



బీఎస్పీలో చేరుతున్న నాయకులు

సారంగాపూర్: రాష్ట్రంలో రాబోయేది బహుజన రాజ్యమేనని బీఎస్పీ జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షుడు బింగి నరేశ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సారంగాపూర్ మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో వివిధ పార్టీల నుంచి బీఎస్పీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో రానున్నది బహుజన రాజ్యమేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు అందరూ పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు ఎరుకొండ వెంకటేశ్, ఉపాధ్యక్షుడు ఎన్నం మహేశ్, బీవీఎస్ కన్వీనర్ రమేశ్, నాయకులు జగన్, నరేశ్, చంద్రయ్య, స్వామి, గంగాధర్, సురేశ్, రాకేశ్, మహేశ్, తిరుపతి, మల్లేశం, అరవింద్, కల్యాణ్, మధు, మనోహర్, శివ, మణికుమార్, పవన్, చరణ్, గణేశ్ పాల్గొన్నారు.

పోచమ్మ తల్లికి భక్తుల చలిబోనాలు



జగిత్యాలటౌన్: మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



ఇబ్రహీంపట్నంలో మహిళలు



కోరుట్లరూరల్: బోనాలు సమర్పిస్తున్న భక్తులు

జగిత్యాలటౌన్: తెల్లవారుజామున పట్టణంలోని లోకమాత పోచమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో బోనాలు సమర్పించారు. అమ్మవారికి చలిబోనాల సమర్పణలో లోకమాత పోచమ్మతల్లి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. పోచమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్ గాజుల రాజేందర్ పాల్గొన్నారు.

కోరుట్లరూరల్ మండలంలో..

కోరుట్లరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం మహిళలు పోచమ్మ తల్లికి చలిబోనాలు సమర్పించారు. ప్రతిఏటా మాఘ అమావాస్య తర్వాత వచ్చే మొదటి ఆదివారం మహిళలు ఒక రోజు ముందు రాత్రి అన్న ప్రసాదాలు వండిపెట్టి తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో గ్రామదేవత పోచమ్మ ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించారు. జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, మహిళా సర్పంచులు తోట శారద, పిడుగు రాధ, దుంపాల నర్సు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం పోచమ్మ చలిబోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం వేళ దేవాలయానికి చేరుకొని దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతి చెందిన శ్రీనివాస్

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామశివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాజీపేటకు చెందిన సింగిడి శ్రీనివాస్(28) గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. శ్రీనివాస్ తన బైక్‌పై జగిత్యాలకు వెళ్తుండగా అల్లీపూర్ గ్రామశివారులో వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి నెలరోజుల క్రితం వివాహమైంది.

గంజ్‌రోడ్డు వంజరి సంఘం ప్రమాణ స్వీకారం

జగిత్యాలటౌన్: పట్టణంలోని గంజ్‌రోడ్ వంజరి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగింది. అధ్యక్షుడిగా నవ్వోతు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా కొండెరి రాము, కోశాధికారిగా నవ్వోతు రాజేందర్, ఉపాధ్యక్షుడిగా బానుక రాజేశం, సహాయ కార్యదర్శిగా బడంగ్ శంకర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల కమిటీ సభ్యులు కొండెరి గంగాధర్, దాత్రుక ధర్మేందర్, కొండెరి లక్ష్మీనారాయణ, కాలేరి శ్రీనివాస్, కోయ భీమయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. కుల సంఘం సభ్యులు, జిల్లాలోని వివిధ గ్రామాల వంజరి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



కోనేరుకు రంగులు అద్దుతున్న సిబ్బంది

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలకు అధికారులు ఏర్పాట్లను ప్రారంభించారు. ఫిబ్రవరి 1 నుంచి 12వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు ఇప్పటికే ఆలయ పరిసరాల్లో ట్రాక్టర్ల సహాయంతో చెత్తను తొలగించడం, బ్లేడ్ ట్రాక్టర్ల సాయంతో చదును చేసే పనులు చేపట్టారు. కొండపైకి నీరు చేర్చే ప్రక్రియను అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. జాతర బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడానికి వచ్చే లక్షల మంది భక్తులకు నీటికి అంతరాయం ఉండకుండా ప్రస్తుతం ఉన్న పైప్‌లైన్లను ఏమైనా లోపాలు ఉన్నాయా అన్న దానిపై పరిశీలించారు. ఆలయానికి, ఇతర ఆలయ ప్రాంగణంలో నిర్మాణాలకు రంగులు అద్దే పనులు కొనసాగుతున్నాయి.

మెగా ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో రోగులు, వైద్యులు

మల్యాల: మండలంలోని మానాల గ్రామంలో ఆదివారం మాధవ సేవా పరిషత్ ట్రస్టు, సులోచన ఆస్పత్రి ఫిజీషియన్ ఆకుతోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, కంటిచూపు పరీక్షలు, దంత పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు, ఎముకల సమస్యలు ఉన్న 238 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఫిజీషియన్ ఆకుతోట శ్రీనివాస్, ఈఎన్‌టీ నిపుణులు వడ్లూరి శ్రవణ్‌కుమార్, ఆర్థోపెడిక్ వైద్యులు కృష్ణచైతన్య, దంత వైద్య నిపుణులు ఇనుగుర్తి రాజశేఖర్, డాక్టర్ ప్రశాంత్, ఆప్తమాలజిస్టు రఘురాం, సర్పంచ్ నల్లాల లక్ష్మీబుచ్చయ్య, ముదుగంటి అనిత, ఉపసర్పంచ్ ఎడిపెల్లి రాజన్న, జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు కండ్లపల్లి గౌతమకృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తుమ్మనపెల్లి మహేశ్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా శ్రీగద్దె ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా బెజ్జారపు శివరాము, కార్యదర్శిగా ముత్యాల అంజయ్య ఎన్నికయ్యారు. సంఘం బలోపేతానికి నూతన కార్యవర్గసభ్యులు కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

✦నియామకం

మల్లాపూర్: షెడ్యూల్డ్ తెగల సంఘం (ఎస్టీ యూనియన్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుగ్లావత్ రాజేందర్ నియామకమైనట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నునావత్ దేవదాస్‌నాయక్ ఆదివారం తెలిపారు.

✦నేతకాని మహర్ సంఘం మండలశాఖ

సారంగాపూర్: నేతకాని మహర్ కులహక్కుల పరిరక్షణ సారంగాపూర్ మండల అధ్యక్షుడిగా కొండగుర్ల మల్లేశ్ నియమితులయ్యారు. కాగా శనివారం సారంగాపూర్ మండల కేంద్రంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించగా అధ్యక్షుడిగా మల్లేశ్ (పోతారం), ప్రధాన కార్యదర్శి బొర్లకుంట మల్లేశ్ (సారంగాపూర్) నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు పిప్పల గంగరాజం, కార్యదర్శి దుర్గం అంజన్న, రాజన్న, సత్యనారయణ పాల్గొన్నారు.

✦మండల కార్యవర్గం ఎన్నిక

మల్లాపూర్: అంబేడ్కర్ యువజన సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అరిగడ్డి పెద్దులు(పాత దాంరాజుపల్లి), ఆర్గనైజింగ్ సెక్రటరీగా కడకుంట్ల వినయ్‌సాహు(రాఘవపేట)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేశ్, మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి లక్ష్మణ్ ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యంగా బడుగు బలహీనవర్గాల ఐక్యతకు కృషిచేస్తూ సామాజిక సమానత్వం కోసం అహర్నిషలు పనిచేయాలని సూచించారు.

✦నాసిరకం పనులతోనే భగీరథ లీకేజీలు

మెట్‌పల్లి: మిషన్ భగీరథ పనులను నాసిరకంగా చేయడంతోనే లీకేజీలు ఏర్పడుతున్నాయని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం ఆరోపించారు. ఈ మేరకు పట్టణ శివారులో లీకేజీలు ఏర్పడ్డ భగీరథ పైపులైన్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. నాయకులు దుర్గం శేఖర్, పుల్లా రాజాగౌడ్, శ్రీధర్, చంద్రశేఖర్, అజీమ్, అమీర్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మహిళలు

కొడిమ్యాల: జగిత్యాల ప్రభుత్వ మహిళా కళాశాలలో 2000–03 విద్యా సంవత్సరంలో బీఎస్సీ, బీజెడ్‌సీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి బృందావనం రిసార్ట్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. కొడిమ్యాల స్వప్న, బొడగం అరుంధతి, సంగెం తిరుమలత, తూకుంట్ల సునీత, గూడూరి జయశ్రీ, బొమ్మిడి సరిత, బొద్దుల శైలజ, తీగల పద్మ పాల్గొన్నారు.